నిశాచరుడు

టెంపోరావ్

రోడ్డమ్మట కొంతసేపు నడిచి అతడు ఒక గేటు ముందు ఆగాడు. గేటుకు అటువైపున తాళం వేసి వుంది. ఊచల మధ్యనుంచి అతడు సూటిగా చూశాడు.

దూరంలో పెద్ద మేడ కనిపిస్తోంది. వాచ్‌మన్ లేనందుకు అతడు సంతోషించాడు. అతడు మెల్లిగా గేటుపైకి యెక్కి అటువైపుకు దూకాడు.

క్షణకాలం నిలబడి అలాగే వుండిపోయాడు. టైమ్ చూశాడు. పన్నెండు దాటింది. ఇంట్లో లైట్లు వెలగడం లేదు. ఇంట్లోని వాళ్ళు నిద్రపోతూ వుండాలి!

అతడు రెండు అరచేతులనూ కలిపి వేళ్ళను విరుచుకున్నాడు. సిగరెట్ వెలిగించాడు. జేబులో వున్న రమ్ బాటిల్ని పైకితీసి కొంచెం రమ్ తాగాడు. సిగరెట్ పొగ పీల్చి వదులుతూ అతడు మేడవైపు మెల్లిగా కదిలాడు.

మేడ ముందు అతడు నిలబడ్డాడు. లోపలకు యెలా వెళ్ళడం? అతడు ఆలోచిస్తూ సిగరెట్ పొగ వదులుతున్నాడు.

ఇంటిచుట్టూ పెద్ద తోట. దూరంలో ప్రహరీ గోడ ఉంది. ధనవంతులు ఇటువంటి మేడల్లో జీవిస్తూ ఉంటారని అతడికి తెలుసు.

అతడు వెనక్కి కదిలాడు. పైకి చూశాడు. పైడాబా మీదున్న ఓవర్ హెడ్ టాంక్ అతడికి కనిపించింది. కిందనుంచి పైపులు పైకి వెళుతున్నాయి, టాంక్ వైపు.

అతడు పైపును ముట్టుకుని గమనిస్తూ ఉండిపోయాడు. గోడకు పైపు దిట్టంగా అమర్చబడి ఉంది. అతడు సిగరెట్ పీకను పక్కకు విసిరాడు.

నేలమీద పడిన సిగరెట్ పీకను అతడు బోడుతో నొక్కి ఆర్పేశాడు. దాన్నితీసి జేబులో వడేసుకున్నాడు. తను ఏదీ ఎక్కడా వదలకూడదు!

అతడిది బరువైన విగ్రహం కాదు. పొట్టిగా, సన్నగా వున్నాడతను. సన్నటి నుదురు. చిన్న తల. అతడు పైపమ్మట పైకి పాకాడు. ఓవర్ హెడ్ టాంక్ దగ్గరకు చేరుకొన్నాడు. పై డాబా మీదకు చూకాడతను.

విశాలమైన డాబా! డాబామీద ఎవ్వరూ లేరు. అతడు డాబా నలువైపులా నడుస్తూ సిగరెట్ వెలిగించాడు. మరికొంచం రమ్ తాగి, సిగరెట్ పొగ పీల్చి వదులూ రోడ్డువైపు చూశాడు.

రోడ్డు దూరంలో వుంది. రోడ్డుదీపాలు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. కాని తనున్న డాబామీద చీకటిగా వుంది. ఆకాశంలో చంద్రుడు లేడు. నక్షత్రాలు మాత్రం తళతళ మెరుస్తున్నాయి.

అతడు గుమ్మంవైపు నడిచాడు. తలుపుమూసి వుంది. అతడు తోసి చూశాడు. తెరవబడలేదు. ఈ తలుపు తెరవగల్గితే తను మెట్లమ్మట కిందకు వెళ్లొచ్చు!

అతడు తన బాగ్‌లోంచి బాటరీ డ్రిల్లింగ్ మిషన్ని పైకి తీశాడు. అతడు తన పని ప్రారంభించాడు. తలుపు లోంచి చిన్న ముక్కలను అతడు కోసిపారేశాడు.

రంధ్రం వైపు చూశాడు. ఒకటిన్నర అడుగులు పొడుగు, ఒకటిన్నర అడుగు వెడల్పు! అతడు రంధ్రం లోంచి అటువైపుకు దిగాడు. గడియతీసి తలుపును తెరిచాడు. గాలికి తలుపు కొట్టుకోకుండా తను కోసిన కర్ర ముక్కలనా తలుపు వారగా పెట్టాడు.

జేబులోంచి టార్చితీసి బటన్ నొక్కాడతను. టార్చి కాంతిలో కిందకు చూశాడు. మేడ మెట్లు కనిపించాయి. మెట్లు మలుపు తిరిగి కిందకు వెళ్తున్నాయి!

అతడా మెట్లమ్మట కిందకు దిగాడు. మూసిన మరి కొన్ని తలుపులు అతనికి అడ్డొస్తాయేమో!

అతడి కళ్ళు మెరిశాయి! తలుపు తెరిచే వుంది. అతడు కిందనున్న హాల్లోకి ప్రవేశించాడు.

టార్చి కాంతిలో నలువైపులా చూశాడు. పెద్ద హాలు. హాల్లో ఖరీదైన సోఫాలు! అతడు ఒక సోఫాలో కూర్చున్నాడు. ఫోమ్ తలగడ మెత్తగా వుంది. అతడు వెనక్కివాలాడు. వెనకనున్న ఫోమ్ తలగడ మెత్తగా తగిలింది.

అతడు రమ్ తాగాడు. మరో సిగరెట్ వెలిగించాడు. తనకు భయంలేదు. ఇంట్లోని వాళ్ళు నిద్రపోతున్నారు!

అతడు టార్చి కాంతిలో చూశాడు. పక్కపక్కనే రెండు గదులున్నాయి. గదుల తలుపులు అతడికి కనిపించాయి.

అతడు ఒక గదివైపు నడిచాడు. తలుపు తెర్చుకుంది. అతడు లోపలకు వెళ్ళాడు. టార్చి కాంతిలో చూశాడు. ఇరవై ఏళ్ళ స్త్రీ పరుపుమీద నిద్రపోతోంది.

అతడామెవైపు చూశాడు. అందంగా వుంది. ఆమె తొడలు కనిపిస్తున్నాయి. స్తనాలు బరువుగా పైకి పొడుచుకొచ్చాయి. అతడు పళ్ళు కొరికాడు. ఆడది అతడి నెప్పుడూ ఆకర్షించలేదు!

టార్చి కాంతిలో అతడామెను చూస్తున్నాడు. ఆమె కదిలింది. లైట్‌ను చూసి మేల్కొని లేచింది.

అతడు టార్చి బటన్ని నొక్కాడు. గదిలో చీకటి. అతడామెవైపు చూశాడు. అర్చేలోగా అతడామె నోరును నొక్కేశాడు.

2

రాత్రి ఒంటిగంటకు శ్రీపతికి మెలుకువచ్చింది. అతడు లేచాడు. స్విచ్ నొక్కాడు. గదిలోని ఫ్లోరసెంట్ లైట్ వెల్గింది.

తన భార్య శ్రీమతిని గురించి అతడు ఆలోచిస్తూ కొంతసేపు కూర్చున్నాడు. తనతో దెబ్బలాడి ఆమె పక్క గదిలో కెళ్ళి పడుకుంది!

అతడు హాల్లోకొచ్చాడు. మెల్లగా భార్య గదిలోకి వెళ్ళి స్విచ్ నొక్కాడు. లైట్ వెల్గింది. అతడు ఆశ్చర్యపోయాడు. ఆమె పరుపుమీద లేదు!

ఆమె ఎక్కడి కెళ్ళింది? కిందనున్న వంటగదిలోకి వెళ్ళిందా? రాత్రిళ్ళు ఆమె కిందకువెళ్ళి టీ చేసుకుని తాగుతూ వుంటుంది!

అతడు గదిలోంచి బయటకు నడిచాడు. హాల్లో మూలగా కిందకు వెళ్ళాడు. డైనింగ్ హాలువైపు నడిచాడతను.

డైనింగ్ హాల్లో లైట్ వెలుగుతోంది! ఆమె అక్కడే వుండివుండాలి! అతడు డైనింగ్ హాలు గుమ్మంవైపు

వెళ్ళాడు. గుమ్మంలో ఆగి లోపలకు చూశాడు.

అతడు వులిక్కిపడ్డాడు. టేబిల్ దగ్గరున్న కుర్చీలో ఎవరో కూర్చుని వున్నారు. అతడివైపు చూసి శ్రీపతి భయంకరంగా అర్చాడు. దడదడలాడే గుండెతో అతడు కిందపడ్డాడు.

పక్కింట్లో వుండే మీనన్ అతడి అరుపు విని అమాంతంగా లేచాడు.

అతడి భార్యకూడా లేచి కూర్చుంది.

"శ్రీపతి యింట్లోంచి యేదో అరుపు వినపడింది!" అన్నాడతను.

"అదంతా మనకెందుకు? పడుకోండి" అంది భార్య.

"వెళ్ళి చూసివస్తాను" అన్నాడు మీనన్.

మీనన్ యింట్లోంచి బయటకు నడిచాడు. శ్రీపతి కాంపౌండులో ప్రవేశించాడు. ముందు తలుపు తెరిచి ఉంది. అతడు లోపలకు వెళ్ళాడు. డైనింగ్ హాలు గుమ్మం ముందు పడున్న శ్రీపతిని చూశాడు.

అతడిని తట్టి లేపాడు. శ్రీపతి లేచి కూర్చున్నాడు. అతడు భయంతో మీనన్ వైపు చూశాడు. తన కెదురుగా వున్న వ్యక్తి మీనన్ అని గుర్తించడానికి శ్రీపతికి టైమ్ బట్టింది.

"ఏమైంది?" అడిగాడు మీనన్.

"మా డైనింగ్ హాల్లో అపరిచితవ్యక్తి యెవరో కూర్చుని తింటున్నాడు" అన్నాడు శ్రీపతి.

"నీ భార్య యెక్కడ?"

"ఆమె తన పడగ్గదిలో లేదు."

మీనన్ మెట్లమ్మట పైకి వెళ్ళాడు. శ్రీపతి పడగ్గదిలోకి అడుగుపెట్టాడు. పరుపు ఖాళీగా వుంది. అతడి

చూపు మంచం కిందకు వెళ్ళింది. అతడు వులిక్కి పడ్డాడు.

వేగంగా అతడు మంచం దగ్గరకు వెళ్ళాడు. వంగి కింద పడున్న శ్రీమతివైపు చూశాడు. ఆమె రక్తం మడుగులో పడుంది. మీనన్ కిందకు పరుగెత్తాడు.

కింద హాల్లో శ్రీపతి కూర్చుని వున్నాడు. మీనన్ వెళ్ళి అతడి యెదురుగా నిలబడ్డాడు.

"నీ భార్యను యెవరో చంపేశారు!" అన్నాడు మీనన్.

శ్రీపతి తృళ్ళిపడ్డాడు. భయంతో మీనన్ వంక చూశాడు.

"ఆమె ఎక్కడుంది?"

"మంచం కింద" అన్నాడు మీనన్.

శ్రీపతి మెట్లమ్మట పైకి పరుగెత్తాడు. మంచం కింద రక్తంమడుగులో పడున్న భార్యవైపు చూసి ఆమెమీద వాలిపోయాడు. అతడు వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"శ్రీపతీ, యిలారా!" అన్నాడు మీనన్, అతడి చెయ్యి పట్టుకుని.

శ్రీపతి లేచాడు. ఇద్దరూ హాల్లో కెళ్ళారు. మీనన్ అతడిని ఒక సోఫాలో కూర్చోబెట్టాడు. శ్రీపతి మాట్లాడే స్థితిలో లేడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"మై డియర్ ఫ్రెండ్ ధైర్యం తెచ్చుకో. ఏడిస్తే పోయిన భార్య రాదు" అన్నాడు మీనన్.

"అది నాకు తెలుసు. అతడే ఆమెని చంపి వుండాలి" అన్నాడు శ్రీపతి.

"ఎవరతను?"

"అతడెవరో నాకు తెలియదు. పొట్టిగా సన్నగా

వున్నాడు. పిశాచంలాంటి వ్యక్తి. డైనింగ్ హాలు గుమ్మంలో నేను పడిపోయాక అతడు పారిపోయి వుండాలి" అన్నాడు శ్రీపతి.

"మనం పోలీస్‌కి రిపోర్టు యివ్వాలి" అన్నాడు మీనన్ ఫోన్ వైపు నడుస్తూ.

3

టెలిఫోన్ మ్రోగడం విని గాఢనిద్రలోంచి లేచాను. నా పక్కన పడుకున్న పార్వతి వంక నవ్వుతూ చూశాను. ఆమె మెలుకువగా లేదు. హాల్లోకి వెళ్ళి రిసీవర్ని ఎత్తాను.

"హలో, పరశురామ్" అన్నాను.

"బ్రదర్, యిన్‌స్పెక్టర్ నాయర్!" అంది అటువైపు కంఠం.

"నాయర్ భాయ్, ఏమిటి సంగతి?"

"శ్రీపతి భార్య శ్రీమతిని యెవరో హత్యచేశారు. శ్రీపతి పెద్ద బిజినెస్ మేన్. నంబర్ 10, లాడర్స్ స్ట్రీట్‌లో ఉంటున్నాడు. అక్కడకు రాగలవా?"

హత్య దేశంలో యెక్కడ జరిగినా నన్ను ఆకర్షిస్తుంది. "వస్తాను నాయర్ భాయ్" అన్నాను.

"నేను అక్కడకు వెళుతున్నాను వెంటనే రా" అని నాయర్ రిసీవర్ పెట్టేశాడు.

దుస్తులు మార్చుకుని కిందకు వెళ్ళాను. డాడ్జి కారును శరవేగంగా లాడర్స్ స్ట్రీట్ వైపు పోనిచ్చాను. గేటు ముందు కానిస్టేబుల్ వున్నాడు. అతడి శల్యూట్‌ని అందుకుని కారుని లోపలికి పోనిచ్చి, పోర్టికోలో వున్న పోలీస్ జీపు వెనకనే ఆపాను. కిందకు దిగాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గరకొచ్చి కరచాలనం చేశాడు.

"బ్రదర్, లోపలకు వెళ్దాం పద" అన్నాడు నాయర్.

ఇన్‌స్పెక్టర్‌తో ముందు హాల్లోకి వెళ్ళాను. మేడ మెట్లెక్కి పైకి వెళ్ళాను. శ్రీమతి పడగ్గదిలోకి యిద్దరం ప్రవేశించాం.

పడగ్గదిలో ఫ్లోరసెంట్ లైటు ప్రకాశవంతంగా వెల్గుతోంది. గదిలో యెవ్వరూ లేరు. మంచం ఖాళీగా వుంది. మంచం కింద చూశాను. అక్కడున్న దృశ్యాన్ని చూసి మామూలు మనుషులు తృళ్ళిపడ్తారు.

వంగి నేలమీద పడున్న ఆమె వైపు చూశాను. ఆమె చాలా అందంగా వుంది. మరణించినా ఆమె అందం తరగలేదు. ఆమె కళ్ళు చూస్తున్నాయి. ఎక్కడో! ఎవర్నో!

కత్తితో ఆమెను పదిసార్లు యెవరో పొడిచివుండాలి. ఆమె రక్తం మడుగులో పడుంది. ఆమె ధరించిన దుస్తుల నిండా రక్తం వుంది.

వెనక్కి తిరిగాను. ఎవరో కసితో ఆమెని చంపివుండాలి. గదిలోంచి బయటకు నడిచాను.

శ్రీపతి వైపు చూశాను. అతడు పొట్టిగా, సన్నగా వున్నాడు. అతడు యీ హత్య చేసివుండకపోవచ్చు.

"మీ భార్యకు ఎవరేనా శత్రువులు వున్నారా?"

"ఎవ్వరూ లేరు!" అన్నాడతను.

"ఆమె చాలా అందమయిన యువతి. మీ పెళ్ళి ముందు యెవరేనా ఆమెను ప్రేమించి పెళ్ళాడాలని అనుకున్నారా?" అడిగాను.

"నాకు తెలిసినంతమటుకు ఆమె నెవరూ ప్రేమించి పెళ్ళాడదల్చుకోలేదు. ఏదేనా వుంటే ఆమె నాకు

తప్పక చెప్పేది. మేమిద్దరం ప్రేమించుకునే పెళ్ళి చేసుకున్నాం" అన్నాడు శ్రీపతి.

శ్రీపతి పక్కనున్న వ్యక్తివంక చూశాను. అతడు పొట్టిగా లావుగా వున్నాడు.

"ఇతడు నా ఫ్రెండ్ మీనన్. పక్కయింట్లో వుంటున్నాడు. ఇతడే పోలీసు రిపోర్టు యిచ్చాడు" అన్నాడు శ్రీపతి.

"మిస్టర్ మీనన్, మీకు తెలిసినదంతా చెప్పండి" అన్నాను.

"శ్రీపతి అరుపు నాకు వినిపించి మేలుకున్నాను. వెంటనే యిక్కడికొచ్చాను. శ్రీపతి డైనింగ్ హాలు గుమ్మం ప్రాంతంలో పడున్నాడు. అతడిని లేవగొట్టి, తర్వాత శ్రీమతి హత్య చేయబడిందని తెల్సుకుని పోలీస్ రిపోర్టు యిచ్చాను" అన్నాడు మీనన్.

శ్రీపతివైపు సూటిగా చూశాను.

"డైనింగ్ హాలు గుమ్మంముందు మీరెందుకు పడున్నారు?" ప్రశ్నించాను.

"నా భార్య పడగ్గదిలో లేదు. ఆమెకోసం కిందకు వచ్చాను. డైనింగ్ హాల్లో లైట్ వెల్గుతోంది. పిశాచం లాంటి వ్యక్తి కుర్చీలో కూర్చుని తింటున్నాడు. అతడిని చూడగానే భయంతో అర్చి కింద పడిపోయాను."

"అతడిని వర్ణించండి!"

"పొట్టిగా, సన్నగా వున్నాడు. చింపిరి జుత్తు. పెద్ద మీసాలు. నల్లటి గెడ్డం. పాంటు, చొక్కా, కోటులో వున్నాడతను. అంతకంటె ఎక్కువగా చెప్పలేను!"

"పడుకునే ముందు మీరు అన్ని తలుపులూ మూశారా?"

"నేనే మూశాను సార్."

"డబ్బు ఏదేనా పోయిందా?"

"నేనింకా చూడలేదు."

"వెళ్ళి చూడండి" అని మేడమెట్లమ్మట డాబా మీదకు వెళ్ళాను.

తలుపు రంధ్రాన్ని గమనించాను. గుండ్రటి కర్ర ముక్కలు తలుపు వారగా వున్నాయి. డాబా మీదకు వెళ్ళాను. నీళ్ళ పైప్ లను గుర్తించాను. హంతకుడు యిటు వైపునుంచే యింట్లోకి ప్రవేశించి వుండాలి!

కిందకు వెళ్లాను. అరగంట తర్వాత శ్రీపతి నా దగ్గర కొచ్చాడు.

"ఆమె నగలు అన్నీ వున్నాయి. డబ్బు పోయినట్లు లేదు" అన్నాడతను.

ఆశ్చర్యపడ్డాను. డబ్బుకోసం యీ హత్య జరగలేదు. అయితే ఎందుకు జరిగింది?

డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షించాడు. "పరశు రామ్‌గారూ, హత్య చేసిన వ్యక్తి పిచ్చివాడేమో! అతడి మూడు నాలుగు కత్తి పోట్లతోటే ఆమె మరణించి వుండాలి. ఆమె మరణించాక కూడా అతడు ఆమెను కత్తితో పొడుస్తూనే వున్నాడు!" అన్నాడతను.

అంత కసి ఆమెమీద హంతకుడికి ఎందుకు ఏర్పడింది? శ్రీపతికి తెలియని రహస్యమేదైనా వుందా?

ఆలోచిస్తూ కిందకు వెళ్ళాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ నాతో కారుదాకా వచ్చాడు.

"నాయర్ భాయ్, నీ పని కానీ? ప్రస్తుతం ఏమీ చెప్ప లేను. అంధకారంలో వున్నాను" అని కారులో కూర్చుని తలుపు మూశాను.

4

మర్నాటి పత్రికలో యీ హత్యగురించి విశేషంగా ప్రచారమయ్యింది. పత్రికా విలేఖర్లు వాళ్ళ యిష్టమొచ్చినట్లు రాసేశారు.

"ఇంత ఘోరంగా శ్రీమతి ఎలా చంపబడింది? ఎందుకీ హత్య జరిగింది? పోలీసులు వెంటనే కనుక్కోవాలి. లేకపోతే ప్రజలు తారెత్తిపోతారు. ఇటువంటి హత్యలు ఇంకా జరగొచ్చని భావించి ప్రజలు భయపడ్తారు!" అని రాశాడు ఒక విలేఖరి.

క్రిష్ణయ్య వేడివేడిగా యిడ్లీ తెచ్చాడు. ఇరవై యిడ్లీ తిని, మూడు కప్పుల కాఫీ తాగాను. ఇడ్లీలోకి క్రిష్ణయ్య చేసిన పొదినా, కొత్తిమిరి, కొబ్బరికాయ మిశ్రమ పచ్చడి నాకు చాలా నచ్చింది.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నవ్వుతూ గదిలోకొచ్చాడు. అతడికి యిడ్లీ తెమ్మన్నాను. అలవాటుప్రకారం వద్దన్నాడు. క్రిష్ణయ్య తెచ్చిన అరడజను యిడ్లీలను మాట్లాడకుండా నవిలేశాడు. ఇన్‌స్పెక్టర్ నాయర్ వేడి కాఫీ తాగాడు. నేను సిగరెట్ వెలిగించి అతడివంక చూశాను.

"నాయర్ భాయ్, ఏమిటి సంగతి?"

"పత్రికలు చూశావా?" అడిగాడతను.

"రెండు ఆంగ్ల దినపత్రికలు చూశాను. శ్రీమతి హత్యను గురించి విశేషంగా రాసేశారు" అన్నాను.

"బ్రదర్, యీ హత్యగురించి నువ్వు ఏమంటావు?"

"హత్య ఎందుకు జరిగిందో మనకింకా తెలియదు. శ్రీపతి చెప్పినదంతా నిజం అనుకుందాం. ఎవడో డాబా తలుపుకు చిల్లుపొడిచి యింటికొచ్చి ఆమెను చంపాడు. అంత కసితో ఆమెనతడు ఎందుకు చంపుతాడు."

ఇన్‌స్పెక్టర్ నాయర్ నావైపు సూటిగా చూశాడు. "శ్రీపతికి యీ హత్యలో ఏదేనా సంబంధం వుందని నువ్వంటావా? క్రితం రాత్రి భార్య తనతో దెబ్బలాడి వేరే పడుకుందని శ్రీపతి నాతో అన్నాడు" నాయర్ ప్రశ్నించాడు.

"భార్యా భర్తలు దెబ్బలాడుకున్నారు. వేర్వేరు గదుల్లో పడుకొన్నారు. వుద్రేకంలో మనిషి ఏదేనా చెయ్యొచ్చు!" అన్నాను.

"అతడిమీద నాకు అనుమానంగా వుంది. ఇంట్లోని వస్తువులు ఏమీ పోలేదు. ధనలాభం కోసం యీ హత్య జరగలేదని స్పష్టంగా తెలుస్తోంది. డైనింగ్ హాల్లో ఎవర్నో చూసి అతడు అరుస్తూ పడిపోవడం పచ్చి అబద్ధం అయి వుండొచ్చు! ఆ తలుపుకు అతడే చిల్లుపొడిచి వుండొచ్చు!" అన్నాడు నాయర్.

"అతడు చెప్పింది నిజం కూడా కావచ్చు! ప్రస్తుతం ఏదీ దృఢంగా మనం నమ్మలేం! మరికొంత దర్యాప్తు చేశాక నిజం మనకు తెలియొచ్చు."

"బ్రదర్, యీ హత్య విషయంలో నువ్వు నాకు సహాయపడాలి. ఈ మధ్య పోలీస్ డిపార్టుమెంటులో నామీద విమర్శలు యెక్కువైనాయి. తొందరగా హంతకుడిని నేను పట్టుకుంటే నన్ను విమర్శించేవారు నోరు మూసుకుంటారు."

అతడివంక నవ్వుతూ చూశాను.

"నాయర్ భాయ్, డోండ్ బాదర్! నీ అంత అనుభవం యీనాడొచ్చే పోలీసువాళ్ళకు లేదు. ఆఖరికి నువ్వు జయిస్తావ్" అన్నాను.

"అందుకు నీ సహాయం కావాలి!"

"నా సహాయం నీ కెప్పుడూ వుంటుంది" అన్నాను.

5

హోటల్ అమర్ కాబిన్‌లో కూర్చుని అతడు తెలుగు దినపత్రికలను చూడసాగాడు. పత్రికలనిండా తన్ని గురించే వుంది! అతడు ఎంతగానో ఆనందించాడు!

ప్రతి పత్రికా తననిగురించే రాయాలి!

హోటల్ బాయ్ గదిలోకొచ్చాడు. అతడు పత్రికలో నిమగ్నుడై వున్నాడు.

"ఏం కావాలి సార్" అన్నాడు బేరర్.

అతడు బేరర్ వైపు చూశాడు.

"చికెన్ బిర్యానీ, చపాతీలు, చికెన్ కూర్మా!" అన్నాడతను.

బేరర్ వెళ్ళిపోయాడు. కాబిన్‌లోని లైట్ ప్రకాశ వంతంగా వెల్గుతోంది. జేబులోని రమ్ బాటిల్ పైకితీసి అతడు కొంచెం రమ్ తాగాడు. రమ్! నీళ్ళుకలిపి తాగే అలవాటు లేదతనికి!

రమ్ వేడిగా గొంతులోంచి లోనకు వెళ్ళి రక్తంతో కలిసి ప్రవహించాలి! వెంటనే మెదడుకు చేరాలి!

శ్రీపతి ఏమీ పోలేదన్నాడు! అతడు తనలో తను నవ్వుకున్నాడు. అతడి భార్య బీరువాలో వున్న మూడొం దల రూపాయిలను తను తీసుకున్నట్లు వాళ్ళకు తెలియదు! పూర్ ఫెలోస్!

ఎక్కువగా డబ్బు పొందాలనే ఆశ అతడికి లేదు. తనకు కావలసిన కొంత డబ్బును మాత్రం తీసుకున్నాడు. బీరువాలో యింకా చాలా డబ్బుంది. అంతా తను తీసు కుంటే గుర్తిస్తారు! కొంచెం తీసుకుంటే డబ్బు పోయి

నట్లు వాళ్ళు గ్రహించరు! తను అనుకున్నట్లే అంతా జరిగింది.

తన్నెవరూ పట్టుకోలేరు. పోలీసులు తన్ని పట్టుకోలేరు! డిటెక్టివ్ పరశురామ్ పరిశోధిస్తున్నాడని అతడు పేపర్లో చూశాడు. అతడు నవ్వుకున్నాడు. పరశురామ్ యీసారి ఓడిపోయి, నవ్వులపాలవుతాడు!

బేరర్ తెచ్చినదంతా అతడు ఆకలితో తినేశాడు. తింటూ మధ్యలో రమ్ సేవిస్తున్నాడు. తినడం పూర్తి చేసి అతడు బిల్లు చెల్లించాడు. దినపత్రికలను తన బాగ్ లో పెట్టుకుని జిప్పర్ మూశాడు. కాబిన్ లోంచి అతడు మెల్లిగా బయటకు నడిచాడు.

రోడ్డువారగా నడుస్తూ అతడు టైం చూశాడు. పది కావస్తోంది. పగలంతా అతడు నిద్రపోతాడు. అతడు నిశాచరుడు! రాత్రిళ్ళు మాత్రమే తిరుగుతూ వుంటాడు.

మైలుదూరం నడిచాడతను. ప్రకాశం పార్కులోకి ప్రవేశించాడు. సిమెంట్ సోఫాలో పడుకున్నాడు. బాగ్ ను తలకింద పెట్టుకున్నాడు. అతడికదే తలగడ!

చల్లటి గాలి వీస్తోంది. అతడికి నిద్రపట్టేసింది! ఎవరో అతడిని లేపారు. అతడు లేచాడు. కళ్ళు నలుపుకుని ఎదురుగా వున్న వ్యక్తివైపు చూశాడు.

పార్కు వాచ్ మన్! అతడి చేతిలో టార్చిలైట్ వుంది.

"ఇది పడగ్గదికాదు, పార్కు!" అన్నాడు వాచ్ మాన్.

పాంటు లోపలజేబులోకి అతడి చెయ్యి వెళ్ళింది. మరుక్షణంలో పదునైన కత్తి బయటకొచ్చింది. వాచ్ మన్ మీదకు దూకాడతను. గాభరాగా వాచ్ మన్ గడ్డినేల

మీద పడ్డాడు. అటుపైన అతడు తన పనిని చకచక సాగించాడు.

కత్తిని తుడిచి పాంటు లోపల జేబులో దాచుకున్నాడు. తన బాగ్ తీసుకుని అతడు శరవేగంగా గేటు వైపు నడిచాడు.

నేలమీద పడున్న టార్చి యింకా వెల్గుతోంది. టార్చి సమీపంలో వాచ్‌మన్ కూనయ్య పడున్నాడు. అతడీ లోకంలో లేడు.

కూనయ్య భార్య అతడికోసం వెతుకుతూ టార్చిలైట్ వెల్గుతున్న చోటకు వచ్చింది. టార్చి కాంతిలో నేలమీద పడున్న భర్తను చూసి ఆమె భయంకరంగా అర్చింది. ఆమె అరుపువిని, పార్కు సమీపంలో వుండే యిళ్ళలోని వాళ్ళు వులిక్కిపడ్డారు.

6

ప్రకాశం పార్కులో కారాపి దిగాను. ఎదురుగా పోలీస్ జీపు వుంది. ఇన్‌స్పెక్టర్ నాయర్ గబగబా నా దగ్గరకొచ్చాడు.

"బ్రదర్, మరో హత్య!" అన్నాడు నాయర్.

ప్రకాశం పార్కులోని లైట్లన్నీ వెల్గుతున్నాయి. సమీపంలో వుండే యిళ్ళలోనివాళ్ళు పార్కులో గుమిగూడారు. ఇన్‌స్పెక్టర్ నాయర్‌తో కొంతదూరం నడిచి వెళ్లాను. సిమెంట్ సోఫా పక్కనే పడున్న వ్యక్తిపైపు చూశాను.

కత్తితో అతడినెవరో కసితో అనేకచోట్ల పొడిచారు. అతడి దుస్తులు రక్తమయంగా వున్నాయి.

"ఎవరితను?" అడిగాను.

"ఈ పార్కు వాచ్‌మన్ కూనయ్య. అతడి భార్య శవాన్ని చూసి అర్చింది. సమీపంలో వుండే యిళ్ళలోని వాళ్ళు యిక్కడికొచ్చారు. ఒక వ్యక్తి నాకు ఫోన్ చేశాడు. నేను ఫోన్ చేసి నేనిక్కడికొచ్చాను" అన్నాడు నాయర్.

కత్తిపోట్లను మళ్ళీ పరీక్షించాను. శ్రీమతిని హత్య చేసినట్లే యితడినీ చంపారు! శ్రీమతి హంతకుడే యీ హత్య చేసేడేమో!

ఒక కానిస్టేబుల్ పెట్రోమాక్స్ లైట్‌ను శవం సమీపంలో పెట్టాడు. వాచ్‌మన్ కూనయ్య వయస్సు యాభై దాటి వుంటుంది.

సమీపంలో వున్న అతడి భార్యవంక చూశాను. మాసిన తెల్లచీరలో వుందామె. నలభై ఏళ్ళపైన ఆమె వయస్సుంటుంది.

"నీ భర్తకు ఎవరేనా శత్రువులున్నారా?" అడిగాను.

"రంగడున్నాడు" అందామె.

"ఎవరతను?"

"నా కూతురంటే ఆడికి పిచ్చి. నా కూతురు ఆడిని పెళ్ళాడ్డం నా మొగుడికిష్టంలేదు" అందామె.

"రంగడు నీ భర్తను బెదిరించాడా?"

"తనని చంపి కూతుర్ని పెళ్ళాడ్తానని రంగడు ఎన్నిసార్లో అన్నాడు" అందామె.

"రంగడిని వెంటనే అరస్టు చేస్తాను" అన్నాడు నాయర్.

"రంగడు ఎక్కడుంటాడు?"

"ఇక్కడకు దగ్గర్లోనే! తాతమ్మన్ సందులోని 7 నంబరు గుడిసెలో వుంటాడు," అందామె.

ఇన్‌స్పెక్టర్ నాయర్ వంక చూశాను.

"నాయర్ భాయ్, ఇక్కడ పని నువ్వు కానీ? నేనా రంగడిని కల్సుని వస్తాను" అని కారువైపు పరుగెత్తాను.

డాడ్జి కారును వేగాంగా పోనిచ్చాను. మెయిన్ రోడ్డు వారగా కారాపి దిగాను. రోడ్డుదాటి సందువైపు నడిచాను. సందు మొనలో ఒక వృద్ధుడు రాయిమీద కూర్చుని వున్నాడు.

"తాతమ్మన్ సందు యిదేనా?"

"అవునుసార్. మీ కెవరు కావాలి?" అడిగాడతను.

"రంగడు" అన్నాను.

"తిన్నగా ఎల్లండి, కుడిపక్క మూడోది."

సందులో లైట్లులేవు. టార్చి కాంతిలో చూసుకుంటూ ఒక గుడిసెముందు ఆగాను. లోపల బుడ్డిదీపం వెలుతోంది. కొబ్బరాకులతో అల్లిన తలుపు మూసివుంది. దగ్గరగావెళ్ళి తలుపునులోసి, లోపలకు వెళ్ళాను. చాపమీద గూండాలా వున్న వ్యక్తి పడుకుని వున్నాడు. బుడ్డిదీపం డిమ్ముగా వుంది. నాటుసారా వాసన గదిలో కొడ్తోంది.

టైం చూశాను. పన్నెండున్నర కావస్తోంది. ఆలోచిస్తూ రంగడివైపు చూశాను. నాటుసారా బాగా కొట్టేసి అతడు నిద్రపోతూ వుండాలి. పక్కన సీసాలో యింకా నాటుసారా వుంది. సీసా పక్కన ప్లాస్టిక్ గ్లాసు వుంది.

అతడిని గట్టిగా తట్టాను. అతడు కళ్ళు తెరిచి నావంక చూశాడు. తృళ్ళిపడ్తూ లేచి కూర్చున్నాడు.

మళ్ళీ నావైపు చూశాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడతను.

"రంగడు నువ్వేనా??"

"అవును సార్."

"ఈ రాత్రి ప్రకాశం పార్కు కూనయ్య యింటికి వెళ్ళావా?"

"వెళ్లాను సార్."

"ఎన్నింటికి కెళ్లావు?"

"నా పని ఏడింటికి అయిపోయింది. తిన్నగా కూనయ్య మామ యింటికెళ్ళి, ఓసారి సూరమ్మను చూసి యిక్కడి కొచ్చేశాను."

"నీ కూనయ్య మామను ఎవరో చంపారు!"

అతడు గాభరాగా నావంక చూశాడు. అతడి నోట మ్మాట మాట పెగల్లేదు.

"అతడిని చంపితే సూరమ్మను పెళ్ళాడవచ్చని అనుకున్నావా?" అడిగాను, అతడివంక సూటిగా చూస్తూ.

"మావని నేనెందుకు చంపుతాను సార్? తన కూతుర్ని నాకివ్వనంటే చంపుతానని సరదాగా అనేవాడిని. నేను బాగా డబ్బు సంపాయిస్తున్నాను. సూరమ్మ నా పెళ్లాం అవుతుందని నాకు తెలుసు."

"నువ్వు డబ్బు ఏం చేసి గడిస్తున్నావు?"

"నేను వడ్రంగిని, సార్. ఎక్కడ యిల్లు కట్టినా తలుపులూ అవీ చెయ్యడానికి నన్ను పిలుస్తారు. చేతిలో కావలసినంత పనుంది."

"ఇలా నాటుసారా తాగితే ఎంతొచ్చినా కారించి పోతుంది!" అన్నాను నవ్వుతూ.

"సూరమ్మ యింటికొస్తే నేను నాటుసారా తాగను, సార్. నేనొంటరివాడిని. అందుకని తాగుతున్నాను."

ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించి అతడివంక చూశాను.

రంగడు యువకుడు. బలమైన శరీరం కలవాడు. అతడు

లేచి నిలబడ్డాడు.

"ఎక్కడికేనా వెళ్ళాలా?"

"మావయ్యను ఎవరో చంపారన్నావుగా. వెళ్ళి చూసి వస్తాను" అన్నాడు రంగడు.

ఇద్దరం సందమ్మట నడిచాం. రోడ్డు వారగా వున్న కారులో అతడిని ఎక్కమన్నాను. అతడు కూర్చున్నాక తలుపుమూసి, అటువైపునుంచి కార్లో ఎక్కి, డ్రైవ్ పోనిచ్చాను.

రంగడు మౌనంగా వున్నాడు. ఓరగా అతడివైపు చూశాను.

"కూనయ్య వాచ్‌మన్‌గా ఎంతకాలం నుంచి పని చేస్తున్నాడు?"

"ఇరవై ఏళ్లు దాటిందని చెప్పాడు మావ."

"అతడికి ఎవరేనా శత్రువులున్నారా?"

"ఆ పార్కులోకి రౌడీలు అప్పుడప్పుడొచ్చి రాత్రిళ్లు పడుకుంటారు. వాళ్ళను మావ తరిమేస్తూ వుంటాడు. ఆ విధంగా కొందరు శత్రువులు వుండొచ్చు!"

సిగరెట్ పొగవదుల్తూ ఆలోచించసాగాను—పార్కు లోంచి తరిమేసినందుకు ఎవరూ అతడిమీద అంత కసి ప్రదర్శించరు.

ప్రకాశంపార్కులో పోలీస్ జీపు వెనకనే కారాపి దిగాను. రంగడు కార్లోంచి దిగి వాచ్‌మన్ యింటివైపు పరుగెత్తాడు.

అటువైపు గబగబా నడిచాను. రెండు గదులున్న చిన్న యింటి ముందుకు వెళ్లాడు రంగడు.

ఇంతకు ముందు నేను చూసిన వాచ్‌మన్ భార్య ఏడుస్తోంది. ఆమె పక్కనున్న సూరమ్మ ఏడుస్తూ రంగడిని

కౌగలించుకుంది. అతడామెను ఓదారుస్తూ ఆమె దగ్గర కూర్చున్నాడు.

ఆ స్థితిలోవున్న వాళ్ళవైపు క్షణకాలం చూసి, మార్గంలో వెల్గుతున్న పెట్రోమాక్స్ లైటువైపు నడిచాను.

ఇన్స్పెక్టర్ నాయర్, డాక్టర్ సుధాకర్ మాట్లాడుకుంటున్నారు. పోలీస్ డాక్టర్ నావైపు తిరిగాడు.

"పరశురామ్‌గారూ, నాకిది చాలా ఆశ్చర్యంగా వుంది. కత్తిపోట్లనుబట్టి శ్రీమతిని చంపినట్లే యీ హత్యకూడా జరిగిందని చెప్పాలి. శ్రీమతినీ, యీ వాచ్‌మన్నీ ఒకే వ్యక్తి చంపవలసిన అవసరం ఏమిటో వూహాతీతంగా వుంది" అన్నాడు సుధాకర్.

"శవాన్ని చూడగానే ఆ అనుమానం నాకూ వచ్చింది" అన్నాను నవ్వుతూ.

"డాక్టర్, రెండు హత్యలకూ ఒకేరకమైన ఆయుధాన్ని హంతకుడు వుపయోగించి వుంటాడా?" అడిగాడు నాయర్.

"సందేహం లేదు. ఒకే ఆయుధం శ్రీమతినీ, కూనయ్యనీ చంపింది!" అన్నాడు డాక్టర్.

ఆలోచిస్తూ ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించాను! ఈ రెండు హత్యలకూ ఎటువంటి సంబంధమూ లేదు. హంతకుడు వీళ్ళిద్దర్నీ ఎందుకు చంపాడు?

నా మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. శ్రీమతి ఈ పార్కుకి వచ్చేదేమో! కూనయ్య ఆమెకు తెలుసేమో! శ్రీమతి భర్తను అడిగి తెల్సుకోవాలి!

రంగడు యీ హత్య చేసుంటాడనే నమ్మకం నాకు లేదు. ఏ పిచ్చివాడో యీ హత్యలు చేస్తూ వుండాలి!

ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి గుడ్‌నైట్ చెప్పి నా డాడ్జి కారువైపు నడిచాను. కారులో కూర్చుని తలుపు మూసి ఆలోచిస్తూ వుండిపోయాను.

ఇన్‌స్పెక్టర్ నాయర్ కారు పక్కనే నిలబడి వున్నాడు.

"నాయర్ భాయ్, నీ పని కానీ!" అన్నాను.

"బ్రదర్, పత్రికలు మామీద దుమ్మెత్తి పోస్తాయి!" అన్నాడు నాయర్.

"కుర్చీలో కూర్చుని రాసినంత సులువుగా హంతకుడిని పట్టుకోలేం!" అన్నాను నవ్వుతూ.

"మనం ఏదో తొందరగా చెయ్యకపోతే ప్రజలు వూరుకోరు! రంగడిని అరస్టు చేయడం మంచిదేమో!" అన్నాడు నాయర్.

అతడివంక సూటిగా చూశాను.

"రంగడు యువకుడు-సూరమ్మంటే అతడికి ప్రాణం. ఆమె తండ్రిని రంగడు హత్య చేశాడంటే నేను నమ్మను!" అన్నాను.

"నువ్వు నమ్మకపోవచ్చు! కాని ప్రజలు తృప్తి చెందుతారు. కావలిస్తే తర్వాత అతడిని విడుదల చెయ్యొచ్చు!"

"నాయర్ భాయ్, తొందరపడకు! ప్రజల్ని తృప్తి పర్చడంకోసం ఒక అమాయకుడిని బాధించడం అన్యాయం!" అని కారును స్టార్ట్ చేసి పోనిచ్చాను.

7

సముద్రపొడ్డున దట్టంగా పెరిగిన సరుగుడు చెట్లకింద అతడు కూర్చుని వున్నాడు. ఎండుటాకులు నేలను పూర్తిగా కప్పేశాయి. సూర్యకాంతి అడ్డపడ్డం లేదు.

అతడు పాంటుజేబులోంచి రమ్ బాటిల్ తీశాడు.

రమ్ తాగుతూ సిగరెట్ వెలిగించాడు. కనుచూపు మేరలో యెవ్వరూ లేరు.

దూరంనుంచి సముద్రపు హోరు వినపడుతోంది. అతడి కళ్ళు యెర్రగా వున్నాయి. ఆకుల చప్పుడు విని అతడు అటువైపు తిరిగాడు. ఆకుల కిందనుంచి త్రాచుపాము తల పైకి లేచింది. అది ఆకులమీద పాకుతోంది.

ఉషారుగా అతడు లేచాడు. పాంటు లోపల జేబు లోంచి కత్తి తీశాడు. త్రాచుపామును ముక్కలు ముక్క లుగా నరికాడు. ముక్కలు ప్రాణంతో అల్లల్లాడు తున్నాయి. ఆనందంతో అతడి కళ్ళు మెరుస్తున్నాయి.

ఆకుల మీద పడున్న ముక్కలవైపు అతడు సంతో షంగా చూశాడు. కత్తిని ఆకుల్తో తుడిచి పాంటు జేబులో పడేసుకున్నాడు.

అతడు తిరిగొచ్చి తన స్థానంలో కూర్చున్నాడు. మరి కొంత రమ్ తాగి సిగరెట్ వెలిగించాడు.

సమీపంలో తునాతునకలై పడున్న పామువంక చూశాడు. దాన్ని నరుకుతుంటే అతడికి చాలా ఆనం దంగా వుంది.

అతడు కళ్ళు మూసుకున్నాడు. గతం గుర్తొస్తోంది. అతడు పేద కుటుంబంలో పుట్టాడు. తండ్రి వడ్రంగిగా పనిచేసేవాడు. తండ్రి తప్పతాగి యింట్లోని భార్యనీ, నలుగురు పిల్లల్నీ చావగొట్టేవాడు.

చిన్నతనంలోనే అతడికి తండ్రిమీద కసి ఏర్పడింది. కాని తన కసిని తీర్చుకునే బలం అప్పటిలో లేదతనికి.

అతడు బడికి వెళ్ళేవాడు. తోటి విద్యార్థులతో పోట్లాడి వాళ్ళ వస్తువులను లాక్కునేవాడు. దాని మూలంగా అతడు బడికి స్వస్తి చెప్పవలసి వచ్చింది.

పనీపాటా లేని అతను గుడిసెలో వ్రూరికే కూర్చోలేక పోయేవాడు. ఒకనాడు అతడిని చూసి ఒక కుక్క మొరిగింది. అతడు దాన్ని యిటికలతో కొట్టి చంపేశాడు. చచ్చి పడున్న కుక్కవైపు చూస్తూంటే అతడికి చాలా ఆనందంగా వుంది.

రాత్రిళ్ళు తండ్రికి భయపడి అతను ఆలస్యంగా ఇంటికొచ్చేవాడు. తండ్రి దెబ్బలు పడలేక అతడి తోబుట్టువులు యెక్కడికో పారిపోయారు. తల్లి మాత్రం నోరు మూసుకుని పడుండేది.

ఒకనాడు రాత్రి తప్పతాగి రోడ్డు వారగా పడుకున్న తండ్రిని అతడు చూశాడు. తండ్రి పీకను నులిపేసి చంపేశాడతను. ఏమీ యెరగనట్లు యింటికి చేరుకున్నాడు. అటుపైన అతడికి భయం లేదు. నాలుగిళ్ళల్లో పనిచేసి తల్లి యెలాగో కుటుంబాన్ని నడిపేది.

అతడికి పెళ్ళిచేసింది తల్లి. పెళ్ళయిన నెలరోజుల తర్వాత అతడి భార్య మరొకడితో లేచిపోయింది. సెక్స్ మీద అతడికి ఉత్సాహం లేదు. స్త్రీ రూపం అతడిని ఆకర్షించేది కాదు. అతడి నిర్లక్ష్యం వల్లనే భార్య లేచిపోయింది.

ఓ సంవత్సరం తిరిగే లోపల తల్లి మరణించింది. గుడిసెను వదిలేసి అతడు పట్నానికి చేరుకున్నాడు. అప్పటినుంచీ పట్నంలోనే వుంటున్నాడు.

పట్నం అతడికి నచ్చింది. లక్షలాది ప్రజలు! ఈ మహాప్రపంచంలో తన్ని యెవ్వరూ గుర్తించరు.

అతడు కళ్ళు తెరిచి పక్కనున్న ప్లాస్టిక్ బాగ్ వైపు చూశాడు. మళ్ళా కళ్ళు మూసుకున్నాడు. అతడికి కాస్సేపట్లో నిద్ర పట్టేసింది.

8

రాత్రి పన్నెండు దాటింది. అతడు రోడ్డమ్మట నడుస్తున్నాడు. ఒక బంగళా గేటు ముందు ఆగాడు. శబ్దం లేకుండా పిట్ట గేటు తెరిచి లోపలికెళ్ళాడు.

బంగళా చుట్టూ కొద్దిగా ఖాళీ స్థలం ఉంది. పూల మొక్కలు ఆ స్థలంలో అతడికి కనిపించాయి. చుట్టూ ముళ్ళతీగలు అమర్చబడ్డాయి.

అతడు మెల్లిగా వెనకవైపుకు వెళ్ళాడు. నుయ్యి కనిపించింది. వెనక అరటి చెట్లు వున్నాయి.

కాస్సేపు అతడు మౌనంగా నిలబడి నలువైపులా చూశాడు. సమీపంలోని యిళ్ళలోని వాళ్ళు నిద్రపోతున్నారు. ఇళ్ళలో దీపాలు ఎక్కడా వెలగడం లేదు.

అతడు జేబులోంచి బాటిల్ తీసి కొంచెం రమ్ సేవించాడు. బాటిల్ని దాచేసి సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ పొగ పీల్చి, వదులుతూ వెనుక తలుపు వంక చూశాడు. తలుపుమీద వేళ్ళతో తట్టి పరీక్షించాడు.

ప్లాస్టిక్ బ్యాగ్లోని డ్రిల్లింగ్ మిషన్ తీశాడు. తలుపుకు పెద్ద చిల్లు యేర్పడింది. అతడు చిల్లులోంచి లోపలకు దూరాడు.

టార్చి కాంతిలో గదిని పరిశీలించాడు. వంట గది. ఒక వైపున గ్యాస్ స్టవ్, సిలిండర్ వగైరా కనిపించాయి.

ఎదురుగా గుమ్మం వుంది. అతడు వెనుక తలుపు గడియలు తీసి బయటనున్న బాగ్ను వంట గదిలో పెట్టి తలుపు మూశాడు. ఎదురుగా వున్న గుమ్మంవైపు నడిచాడు.

తలుపు దగ్గరగా మూసివుంది—తోసి అతడు లోపలికి వెళ్ళాడు. టేబుల్ కటూ యిటూ కుర్చీలున్నాయి.

ఫార్మికాతో కప్పిన టేబుల్ మీద కొన్ని పాత్ర లున్నాయి.

అతడు పాత్రలను పరీక్షించాడు. అన్నం, వంకాయ కూర, సాంబార్, గడ్డకట్టిన పెరుగు, నెయ్యి మంచినీళ్ళు వగైరా వున్నాయి. ఇవన్నీ యెందుకిక్కడ అమర్చ బడ్డాయి? ఎవరేనా భోజనానికి వస్తారా?

అతడు యెదురుగా వున్న మరో గుమ్మం వైపు చూశాడు. గుమ్మం దాటి వెళ్ళాడు. హాలు! హాల్లో పేము సోఫాలు ఉన్నాయి.

టార్చి కాంతిలో అతడు గది నలువైపులా చూశాడు. ఒక గుమ్మం వీధివైపు వుంది. రెండో గుమ్మం తలుపు తెరిచి వుంది. పడగ్గది అయివుండాలి!

అతడు పడగ్గది గుమ్మంలో నిలబడి లోపలకు చూశాడు. నీలం రంగు జీరోవాట్లు బల్బు వెలుగుతోంది. ఆ కాంతిలో పరుపుమీద పడుకున్న ఆకారం అతడికి కనిపించింది.

అతడు పరుపు దగ్గర కెళ్ళాడు. పరుపుమీదున్న స్త్రీ వైపు చూశాడు. వెంటనే అతడిలో యేదో సంచలనం రేకెత్తింది. పాంటు లోపల జేబులోంచి కత్తిని పైకి తీశాడు. ఆమె వైపు పిశాచంలా చూశాడు.

అతడి యెడంచేయి ఆమె నోరును నొక్కేసింది. అనేకచోట్ల కత్తి ఆమె శరీరంలోకి దిగింది.

బయట యేదో స్కూటర్ ఆగిన చప్పుడయింది. అతడు గాభరాగా లేచి నిలబడ్డాడు. బయట బూట్ల చప్పుడు. పిట్టగేటు తెరుస్తున్న ధ్వని.

కత్తిని ఆమె చీరకు తుడిచాడతను. జీరోవాట్ బల్బును ఆర్పేసి వంట గదిలోకి పరుగెత్తాడు.

లోపలకు యెవరో వస్తున్నారు! వంటగది, డైనింగ్

రూమ్ గుమ్మంలో చీకట్లో అతను నిలబడ్డాడు. ముందు తలుపు తోసి యెవరో లోపలకొచ్చారు. హాల్లోని లైటు వెలిగింది. తలుపు పక్కనుంచి అతడు హాల్లో కొచ్చిన వ్యక్తి వైపు చూశాడు.

ఆ వ్యక్తి ఖుషారుగా పడగ్గది వైపు కదిలాడు. అతడు వెనక్కి జరిగి ప్లాస్టిక్ బాగ్‌ను అందుకుని, తలుపు తెరిచి నూతి పక్కనుంచి ముళ్ళతీగల దగ్గరకు పరుగెత్తాడు. అదే క్షణంలోనే పడగ్గదిలో కెళ్ళిన వ్యక్తి అరుపు భయంకరంగా అతడికి వినపడింది.

అతడు ముళ్ళతీగల మధ్యనుంచి దూరి వెనుక నున్న కాంపౌండ్‌లోకి వెళ్ళాడు. వేగంగా అడుగులేస్తూ వెనక వైపునున్న రోడ్డుకు చేరుకున్నాడు.

రోడ్డమ్మట వేగంగా అతడు నడిచి వెళ్ళిపోయాడు.

9

పోలీస్ జీపు వెనకనే డాడ్జి కారాపి దిగాను. చాలా మంది ప్రజలు బంగ్లా ముందు గుమిగూడారు. చిన్న గేటు తెరిచి వుంది.

ముందు వరండా మీద స్కూటర్ వుంది. ఒక కానిస్టేబుల్ అక్కడ నిలబడి వున్నాడు. అతడు వినయంగా నాకు శల్యూట్ చేశాడు.

ముందు హాల్లోకి వెళ్ళాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ యెదురుగా వచ్చి నా చెయ్యి పట్టుకున్నాడు. సమీపంలో వున్న వ్యక్తిని అతడు నాకు పరిచయం చేశాడు.

"ఈయన పేరు రాజన్. ఒక పబ్లిషింగ్ కంపెనీకి మేనేజర్" అన్నాడు నాయర్.

అతడివైపు క్షణకాలం చూసి యిన్‌స్పెక్టర్‌తో పడగ్గదిలోకి వెళ్ళాను.

పడగ్గదిలో ఫ్లోరో సెంట్ లైట్ వెల్గుతోంది. డబుల్ కాట్ మీదున్న స్త్రీ వైపు చూడ్డానికి మనిషికి బాగా ధయిర్యం వుండాలి.

ఏ పిశాచమో ఆమెను కత్తితో అనేకచోట్ల పొడిచి నట్లుంది. ముఖం నుంచి కాళ్ళదాకా కత్తిపోట్లు. ఆమె ధరించిన చీర, జాకెట్ రక్తమయంగా వున్నాయి.

ఆమె మెళ్ళో బంగారం గొలుసుంది. చేతులకు గాజు లున్నాయి. చెవులకు మెరుస్తూన్న కమ్మలు వున్నాయి.

"బ్రదర్, నాతో రా" అన్నాడు నాయర్.

డైనింగ్ హాల్లోంచి వెనకనున్న వంట గదిలోకి వెళ్ళాను. వెనుక తలుపు వైపు నాయర్ చెయ్యి చూపించాడు. తలుపులో పెద్ద చిల్లు. అందులోంచి దూరి హంతకుడు లోపలకు వచ్చుండాలి.

చిల్లు పొడిచిన తలుపువైపు చూస్తూ వుండిపోయాను. ఇదే విధంగా శ్రీపతి యింట్లో జరిగింది.

"నాయర్ భాయ్, శ్రీమతిని చంపినతడే ఈ హత్య చేసుండాలి. సందేహం లేదు" అన్నాను.

"యూ ఆర్ రైట్ బ్రదర్" అన్నాడు యిన్స్పెక్టర్.

తలుపు లాగి బయటకు నడిచాను. నాయర్ నా వెనకనే వచ్చాడు. నుయ్యి, కొంచెం దూరంలో ముళ్ళ తీగలు.

"హంతకుడు యీ గుమ్మంలోంచి లోపలకు వెళ్ళి యిటువైపునుంచే వెళ్ళిపోయి వుంటాడు" అన్నాడు నాయర్.

ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాను. పొగ వదులుతూ నలువైపులా చూశాను. సమీపంలో వున్న యిళ్ళల్లో

లైట్లు వెల్గుతున్నాయి. ఆ యిళ్ళలోని వాళ్ళు హత్య జరిగిన యింటివైపు చూస్తున్నారు.

వెనక్కు తిరిగాను. హాల్లోకి నడిచాను. రాజన్ విచారవదనంతో పేము సోఫాలో కూర్చుని వున్నాడు. అతడి యెదురుగా నిలబడ్డాను. అతను లేవబోయాడు.

"ప్లీజ్, కూర్చోండి" అన్నాను.

డాక్టర్ సుధాకర్‌తో యిన్‌స్పెక్టర్ నాయర్ పడగ్గదిలోకి వెళ్ళాడు.

"మిస్టర్ రాజన్, జరిగిందంతా చెప్పండి!" అన్నాను.

"నేను పొద్దుట పదింటికి భోజనంచేసి వెళ్ళాను. ప్రతిరోజూ ఏడు లోపల వచ్చేస్తూ వుంటాను. ఇవాళ మా బాస్ బెనర్జీ వుండే హోటల్ సవేరాకి వెళ్ళాను. అక్కడ డిన్నర్‌చేసి నేను వచ్చేసరికి ఒంటిగంట కావస్తోంది. ఇంటికొచ్చి నేను చూసేసరికి నా భార్య ఆ స్థితిలో వుంది" అని అతడు ఏడ్వసాగాడు.

"ఆలస్యంగా వస్తారని మీ రామెతో పొద్దుట చెప్పారా?" ప్రశ్నించాను.

"చెప్పాను. భోజనంచేసి పడుకోమన్నాను. ముందు తలుపు తాళం తీసి నేను లోపలకు వచ్చాను" అన్నాడతను.

ముందు తలుపును పరీక్షించాను. ఏర్ లాక్ అమర్చబడింది. బయటవాళ్ళు లోపలకు వెళ్ళాలంటే తాళంచెవి వుండాలి.

"మీరు యింటి ముందు స్కూటర్ ఆపి దిగేసరికి ఏ గదిలోనైనా లైట్లు వున్నాయా?"

నా ప్రశ్న విని అతడు వులిక్కిపడ్డాడు. నా వైపు భయంతో చూశాడు.

"నేను వచ్చేసరికి పడగ్గదిలో జీరోవాట్ బల్బు వెల్గుతున్నట్లు బయటనుంచి గుర్తించాను. కాని నేను లోపలకు వచ్చేసరికి పడగ్గదిలో చీకటిగా వుంది. లైట్లు నేను ఆన్ చేశాను" అన్నాడు రాజన్.

ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించి ఆలోచిస్తూ ఉండిపోయాను. రాజన్ వచ్చేసరికి హంతకుడు పడగ్గదిలో వున్నాడు. బయట స్కూటర్ చప్పుడు విని అతడు లైట్ ఆపుచేసి వుండాలి!

తటాలున పడగ్గదిలోకి వెళ్ళాను. రెండు కిటికీలున్నాయి. ప్లాస్టిక్ గ్లాసు తలుపులు రెండూ మూసి వున్నాయి. మంచం పైనున్న సీలింగ్ ఫాన్ తిరుగుతోంది.

గదిలో వున్న డాక్టర్ సుధాకర్ వైపు చూశాను.

"మిస్టర్ పరశురామ్, ఈమె పన్నెండున్నర ఒంటిగంట మధ్య మరణించి వుండాలి. ఇంతకు ముందు శ్రీపతి భార్య యిలాగే హత్య చేయబడింది. అది మీరు గమనించి వుంటారు" అన్నాడు డాక్టర్.

ఆలోచిస్తూ హాల్లోకి నడిచాను. "మిస్టర్ రాజన్, మీ భార్య కిటికీ తలుపులు మూసుకునే పడుకునేదా?"

"నేను యింట్లో లేకపోతే ఆమె కిటికీ తలుపులను మూసే పడుకునేది."

"మీరు యిక్కడకు ఎన్నింటికి వచ్చారు?"

"12.50 కి వచ్చుంటాను."

"దిగ్గానే టైమ్ చూశారా?"

"లేదు. స్కూటర్ స్టార్ట్ చేసే ముందు హోటల్ సవేరాలో టైమ్ చూశాను. అప్పుడు 12.35 అయింది. అక్కడనుంచి యిక్కడకు రావడానికి 15 నిమిషాలు

పడ్తుంది."

నా వాచ్ వంక చూశాను. 1.45 కావస్తోంది. 12.50కి హంతకుడు యింట్లో వున్నాడు. రాజన్ రావడం గమనించి అతడు వెనకవైపునుంచి వెళ్ళిపోయి వుండాలి.

మళ్ళీ లోపలి గదుల్లోంచి సుయ్యి దగ్గరకు వెళ్ళాను. ఆలోచిస్తూ అక్కడ నిలబడ్డాను. హంతకుడు యెటువైపు వెళ్ళుంటాడు?

"సార్!" ఎవరో పిల్చారు.

ముళ్ళతీగల దగ్గరకు నడిచాను. అటువైపున మధ్య వయస్సులో వున్న వ్యక్తి నా వైపు చూశాడు.

"సార్, ఎవరో మా కాంపౌండ్‌లోంచి వెళ్ళిపోడం మా అమ్మాయి చూసింది" అన్నాడతను.

పన్నెండేళ్ళ ఆడపిల్ల మెల్లిగా వచ్చి తండ్రి పక్కన నిలబడింది. ముళ్ళతీగల మధ్యనుంచి దూరి వాళ్ళ కాంపౌండులోకి వెళ్ళాను.

"అమ్మాయి సీత మీ కంతా చెప్తుంది" అన్నాడతను.

సీత నన్ను తనతో రమ్మంది. ఒక కిటికీ పక్కనే అందరం ఆగాం. గదిలో లైటు వెల్గుతోంది.

"ఆ గదిలో నేను పడుకుని వున్నాను. నా మంచం కిటికీ పక్కనే వుంది. ఏదో కేక విని ఉలిక్కిపడి లేచాను. ఒకతను కిటికీ పక్కనుంచి రోడ్డు వైపుకు వేగంగా పోయాడు."

"అతడెలా వుంటాడు?"

"చెప్పలేను సార్. నా గదిలో లైట్ లేదు. చీకటిలో వున్నాను. అతడు మా గేటులోంచి రోడ్డు మీదకు పోయివుంటాడు."

ఆమెకు థాంక్స్ చెప్పి రాజన్ వున్న హాల్లోకి చేరు

కున్నారు. మరోసారి టైం చూశాను. రెండయింది. హంతకుడు రాజన్ యిల్లు విడిచిపెట్టి ఒక గంట పది నిమిషాలు అయింది. అతడికోసం అన్వేషించాలి.

బయటకు పరుగెత్తాను. కారులో కూర్చుని తలుపు మూశాను. ఇన్‌స్పెక్టర్ నాయర్ నా దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

“నాయర్ భాయ్, నీ పని కానీ! అలా వెళ్ళివస్తాను” అని కారును పోనిచ్చాను.

కొంతదూరం పోయాక కారును ఎడంవైపుకు తిప్పి వెనకరోడ్డమ్మట పోనిచ్చాను. రోడ్డు దీపాలు వెలుగుతున్నాయి. ఇరువైపులా చూస్తూ కారును పోనిచ్చాను.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. హంతకుడు నడిచివెళ్ళి వుండాలి? గంటలో అతడు చాలాదూరం పోవచ్చు. అతడికోసం వెతకడం వృధా అనిపించింది.

రోడ్డు వారగా ఒక పాక. పాకలో టీకొట్టునుచూసి కారాపి దిగాను. పాక ముందుకి వెళ్ళాను. పాలు మరుగుతున్నాయి. పొడుగాటి బల్లమీద గాజు పాత్రల్లో బన్నులు బిస్కట్లు వగైరా వున్నాయి. అటువైపు నిలబడి షాపు యజమాని నావైపు ఆశ్చర్యంగా చూశాడు.

“ఒంటిగంట తర్వాత టీ తాగడానికి యిక్కడికి ఎంత మంది వచ్చారు?” ప్రశ్నించాను.

“చాలామంది వచ్చారు సార్” అన్నాడతను.

అతడివంక సూటిగా చూశాను.

“ఈ సమీపంలో హత్య జరిగింది. హంతకుడు యిటు వైపు వచ్చి వుండొచ్చు. నీ సహాయం నాకు కావాలి” అని ఆగాను.

అతడు భయంతో నావైపు చూశాడు.

"ఒకతను వచ్చాడు సార్. ఆతడిని యింతకు ముందెప్పుడూ నేను చూడలేదు. అతడు నీళ్ళు అడిగాడు. ప్లాస్టిక్ జగ్గులో యిచ్చాను! అలా వెళ్ళి మొహం, చేతులు కడుక్కున్నాడు. అరడజను బన్నులు కొని పట్టుకు పోయాడు" అన్నాడతను.

"అతడు మొహం ఎక్కడ కడుక్కున్నాడు?"

పాపతను చేత్తో చూపించాడు.

ఆ ప్రదేశాన్ని టార్చి కాంతితో పరీక్షించాను. ఒక చోట నేలమీద నీళ్ళుపడిన సూచనలు వున్నాయి. తడి నేలను గమనించాను. రక్తం మరకలు ఏమైనా కనిపిస్తాయేమో అని చూశాను. తడి నేలమీదున్న కాగితం ముక్క కొద్దిగా ఎర్రబడింది!

వెనక్కు తిరిగాను. కొట్టుముందుకు వెళ్లాను.

"అతడు వెళ్ళిపోయి ఎంతసేపైంది?"

"అరగంటయింది సార్."

"ఎలా వెళ్ళాడతను?

"ఆ మైదానంవైపు వెళ్లాడు."

అతడు చూపించిన మైదానం వైపు చూసాను. విశాలంగా వుంది. చీకటిమయం.

"అలా వెళ్తే ఎక్కడికెళ్లొచ్చు?"

"రైలుపట్టాల దగ్గరకు" అన్నాడతను.

"అతడెలా వుంటాడు?"

"సన్నగా, పొట్టిగా వుంటాడు. గడ్డం వుంది. పాంట్, చొక్కా, పైన కోటు వేసుకున్నాడు. భుజానికి నల్లటి బాగ్ వేళ్ళాడుతోంది. చింపిరి జుత్తు!"

ఇంతకు ముందు శ్రీపతి చెప్పింది గుర్తుకొచ్చింది.

అతడికి థాంక్స్ చెప్పాను. రోడ్డువారగా వున్న నా కారును చూసుకోమని మైదానంవైపు అడుగువేశాను.

కడ్డినేల. వేగంగా అడుగులు వేస్తున్నాను. కొంచెం దూరం వెళ్ళాక ఆగి సిగరెట్ వెలిగించాను. పొగపీల్చి వదులూ నలువైపులా చూశాను.

ఎక్కడా జనసంచారం లేదు. వెనక దూరంలో రోడ్డు లైట్లు, టీకొట్టు కనిపిస్తున్నాయి. రైలుపట్టాలు యింకా ఎంతదూరంలో వున్నాయో!

మెల్లిగా అడుగులు వేస్తున్నాను. రైలు యింజన్ కూత వినబడింది. కొంచెం సేపయ్యాక యింజన్ హెడ్ లైట్ కాంతిలో పట్టాలు కనిపించాయి. ఆ కాంతిలో పట్టాలపొడుగునా చూశాను.

ఒక ఆకారం పట్టాల పక్కనే కదుల్తోంది!

రైలు పట్టాలు నాకు ఒకటిన్నర ఫర్లాంగుల దూరంలో వుండొచ్చు. గూడ్స్ట్రెయిన్ వేగంగా వెళ్ళిపోయింది. మళ్ళా చీకటిమయం. నేను చూసిన ఆకారం వైపు వేగంగా అడుగులేశాను.

చీకట్లో చూడ్డానికి నా కళ్ళు అలవాటుపడ్డాయి. పట్టాలపక్క నడుస్తున్న ఆకారం యిప్పుడు దగ్గర్లో కనిపిస్తోంది.

నా బూట్లు చప్పుడుచేస్తున్నాయి. ఆ వ్యక్తి అమాంతంగా ఆగి నావైపు చూశాడు. నిశ్శబ్దంగా నిలబడ్డాను. అతడు మళ్ళా నడక ప్రారంభించాడు.

పట్టాలకు దగ్గరయ్యాను. పైకి నిక్కి, పట్టాల పక్క నిలబడి దూరంలో వెళ్తూన్న వ్యక్తివైపు తీక్షణంగా చూశాను.

సందేహం లేదు. టీషాపతను వర్ణించిన వ్యక్తి అతడే!

వేగంగా వెళ్ళిపోతున్నాడు.

పట్టా పక్కనే అతడివైపు శరవేగంగా నడవసాగాను.

10

అతడు ఆగాడు, నన్ను చూసి. జేబులోంచి టార్చి తీసి, ఆన్ చేసి అతడివైపు తిప్పాను. అతడు అమాంతంగా పరుగెత్తసాగాడు.

"ఆగు! ఎవరు నువ్వు?" అర్చాను.

అతడు జవాబివ్వలేదు. కొంచెం దూరం వెళ్ళి ఆగాడు. పాంట్ అడుగు భాగాన్ని పైకి తిరగేసి లాగాడు. అందులోంచి తటాలున కత్తి అతడి చేతిలోకొచ్చింది.

అతడు నావైపు సూటిగా చూశాడు. టార్చి కాంతిలో అతడి ముఖాన్ని పరీక్షించాను. ఎర్రబడిన కళ్ళు! భుజానికి బాగ్ వేళ్ళాడుతోంది. టార్చి కాంతిలో అతడి చేతిలో వున్న కత్తి మెరుస్తోంది.

"రాస్కెల్! కత్తిని పక్కపడేసి నా ప్రశ్నలకి జవాబియ్యి" అర్చాను.

అతడు అమాంతంగా పులిలా నావైపు దూకాడు! టార్చిని ఆఫ్ చేశాను. చటుక్కున పక్కకు జరిగాను. అతడు రైలు పట్టాలమధ్య పడ్డాడు.

కత్తున్న అతడి చెయ్యిని బూట్‌తో గట్టిగా నొక్కాను. అతడు లేవబోయాడు. మరోకాల్తో అతడిని పొట్టలో తన్నాను. అతడు పక్కకు పడ్డాడు. నా బూట్ కిందనున్న చెయ్యిని యింకా గట్టిగా నొక్కాను. కత్తిని అతడు వదిలేశాడు. అతడి శరీరాన్ని కత్తికి దూరంగా తన్నాను.

అతడు మూలుగుతున్నాడు. టార్చి ఆన్ చేసి అతడివంక చూశాను. అతడిని లేవదీసి, చేతుల్ని వెనక్కువిరిచి

నైలాన్ తాడుతో కట్టేశాను.

అతడి భుజానికున్న బాగ్ ను తీసి, తెరిచి చూశాడు. డ్రిల్లింగ్ మిషన్, మరికొన్ని పనిముట్లు వగైరా వున్నాయి!

కత్తిని జేబురుమాల్లో చుట్టి బాగ్ లో పడేసి అతడి భుజానికి తగిలించాను.

"పద!" అర్చాను.

అతడు ముందు నడుస్తున్నాడు. టార్చి కాంతిలో అత డిని గమనిస్తూ వెనకనే వస్తున్నాను.

మైదానంగుండా నడిచి యిద్దరం టీకొట్టు ప్రాంతానికి చేరుకున్నాం. అతడిని కారు ముందుసీటులో కూర్చోబెట్టి తలుపు మూశాను. నా సీట్లో కూర్చుని కారును వెనక్కి తిప్పి పోనిచ్చాను.

రాజన్ యింటిముందు కారు ఆగింది. ఇన్ స్పెక్టర్ నాయర్ కారు దగ్గరకు గబగబా వచ్చాడు.

"నాయర్ భాయ్, మిసెస్ రాజన్ హంతకుడిని నీ కిస్తున్నా. ఇతడే శ్రీమతిని హత్య చేసుండాలి! ప్రకాశం పార్క్ కూనయ్యను కూడా యితడే చంపి వుండొచ్చు" అన్నాను.

"బ్రదర్, యితడు నీకు ఎక్కడ దొరికాడు?"

"ఇతడికోసం చాలా దూరం నడవ్వలసి వచ్చింది. అంతా తర్వాత చెప్తాను" అన్నాను.

అతడిని ఇన్ స్పెక్టర్ నాయర్ బయటకు దింపాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ అతడిని లాక్కెళ్ళి పోలీస్ జీప్ లో కూర్చోబెట్టారు.

* * *

118

ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను. సైకియాట్రిస్ట్ ఆనంద్ నవ్వుతూ గదిలోకొచ్చి నాతో కరచాలనం చేశాడు.

"పరశురామ్‌గారూ, అతడిని పట్టుకుని మీరు ప్రజలకు చాలా సేవచేశారు. అతడొక కిల్లర్ మేనియాక్! జంతువుల్నో, మనుషులనో చంపితేగాని అతడు ఆనందంగా బ్రతకలేడు. సైకోపథిక్ కిల్లర్!" అన్నాడు ఆనంద్.

"శ్రీమతిని, కూనయ్యని, మిసెస్ రాజన్ని చంపానని అతడు ఒప్పుకున్నాడు. ఇంకా ఎందర్నో గతంలో అతడు చంపానన్నాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"ఇటుపైన ప్రజలు క్షేమంగా బ్రతకొచ్చు" అన్నాను నవ్వుతూ.

—: ఐపోయింది :—